

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.

పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై ఆ794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.

భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాధలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. ఆ794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.

(గతసంచికతరువాయి)

### సర్క్యూట్ కమిటీ సిఫార్సులపై చర్చలు

విశాఖ నుంచి జిల్లా కలెక్టరు వచ్చి సిఫార్సులను అందించిన తర్వాత రాజాస్థానంలో ఒకలాంటి స్థబ్దత ఏర్పడింది. అతను వెళ్ళిపోయిన తర్వాత కూడా ఆ ప్రభావం అక్కడివారిలో తొలిగిపోలేదు.

చిన విజయరామరాజు ఈ సిఫార్సులను చదువుకున్న తర్వాత దివాణంలో ముఖ్యులను పిలిపించి సమావేశం జరిపారు ఆ సమావేశానికి వచ్చినవారు అనుభవజ్ఞులు అన్ని విషయాలు తెలిసినవారు కావడంతో వారు కమిటీ సిఫార్సులను వారి తెలివితేటలకనుగుణంగా వివిధ రకాలుగా భాష్యం చెప్పారు.

దివాన్ సీతారామరాజు కూడా రెండురోజులు విజయరామరాజుతో మాట్లాడలేకపోయాడు. ఇంత తొందరగా బ్రిటిష్‌వారు ఇటువంటి చాలా ప్రభావం చూపిస్తుందని అతనికి తెలుసు. కానీ విజయరామరాజుకు పూర్తిగా అర్థమయ్యేటట్లు చెప్పడానికి అతనికి మనస్కరించలేదు.

సర్క్యూట్ కమిటీ చిన్న రాజ్యాలు రాజులు పరిపాలిస్తున్న సంస్థానాలపై తీసుకున్న నిర్ణయాల వల్ల వారు ఏ పని చేయడానికి కూడా అవకాశం ఉండదు. ప్రతి విషయానికి బ్రిటిష్ వారిని సలహాలు సూచనలను అడగవలసి ఉంటుంది. ఇది స్వతంత్రత కలిగిన రాజులకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా అంతవరకు ఎంతో స్వతంత్రంగా వ్యవహరించిన విజయనగరం సంస్థానంలో ఒకరికి అనుగుణంగా వారికి అనుబంధంగా పనిచేయడమన్నది ఎంతో కష్టమని అర్థమవడానికి ఎంతో సమయం పట్టలేదు.

విజయనగరం సంస్థానంలో పనిచేస్తున్న వారు చాలామంది విజయరామరాజుకు ఈ విషయాలన్నీ చెప్పారు "మహారాజా ఇంతవరకు కొన్ని సంస్థానాలలో మాత్రం సర్క్యూట్ కమిటీ సిఫార్సులను అమలు చేశారు. మన దివాణం విషయంలో మినహాయింపు వస్తుందని ఉంటుందని అనుకున్నాం. కానీ అలా రాలేదు. అందరి మాదిరిగానే మనకు కూడా కమిటీ సిఫార్సులను అమలు చేయాలని అనుకున్నారు. అంటే రానున్న కాలంలో మనం కూడా బ్రిటిష్ వారితో ఇబ్బందులు పడే పరిస్థితులు వస్తాయి" అని చెప్పారు.

కింది స్థాయి సిబ్బంది చెప్పిన విషయాలు అర్థం అయిన తర్వాత ఏదో కోల్పోయిన బాధ విజయరామరాజులో కలిగింది. అప్పటివరకు ఉన్న స్వేచ్ఛ కోల్పోయి భావన అతనిలో ఏర్పడింది.

తర్వాత అంతరంగికులతో సమావేశమయ్యారు.

అందరూ రకరకాల విషయాలు చెప్పారు. వారు చెప్పినవన్నీ విన్న తర్వాత గొంతు సవరించుకుని "ఈ కమిటీ సిఫార్సులవల్ల ఎటువంటి పరిస్థితులు వస్తాయి. కలెక్టరుగారు అందించిన కాగితాల్లో ఉన్న ముఖ్యమైన విషయాలు ఏమిటి? వాటిని అధిగమించడానికి మనం ఏమి చేయాలి? ఈ సిఫార్సులు విజయనగరం దివాణానికి ఎంతవరకు నష్టం కలిగిస్తాయో పరిశీలన చేసి ఒక నివేదికను తయారు చేసి అందించాలి" అన్నారు.

ఈ విషయం విన్న తర్వాత ఈ సర్క్యూట్ కమిటీ సిఫార్సుల విషయంలో రాజుగారు ఎంత ఆందోళన పడుతున్నారో వచ్చిన వారికి అర్థం అయింది. అయితే అందులో ఉన్న విషయాలు కొన్ని అక్కడివారందరికి తెలుసు. కానీ దానివల్ల రానున్న కాలంలో రాబోయే పరిణామాలు ఎలా ఉంటాయన్న విషయాలను చెప్పవలసి ఉందని వారికి అర్థం అయింది.

"తప్పకుండా" అన్నారు.

"ఈ సిఫార్సుల వల్ల మన రాజ్యానికి వెనువెంటనే వచ్చే ప్రమాదం ఏమీ కనిపించడంలేదు. కానీ రానున్న కాలంలో కొన్ని విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కోవలసి ఉంటుంది బ్రిటిష్ వారికి అనుగుణంగా మనం ఉండాలంటే మనకున్న స్వేచ్ఛను చాలావరకు కోల్పోవలసి

ఉంటుంది. ఆ స్వేచ్ఛను పరిరక్షించుకోవడానికి ఎటువంటి పరిస్థితులయినా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి" దివాన్ సీతారామరాజు స్థిరంగా చెప్పారు.

అప్పటికే జిల్లా కలెక్టరు అందజేసిన కాగితాల్లో ఉన్న విషయాలను అందంగా కాపీ చేసి ఒక కట్టని కింది స్థాయిలో పరిపాలనా వ్యవహారాలు చూసే సిబ్బందికి అందించబడ్డాయి. ఇద్దరు వ్యక్తులు వాటిని అందుకున్నారు.

"మరోసారి మీకు మనవి చేస్తున్నాను. ఈ సిఫార్సులు మనకు అనుకూలంగా ఉండవని తెలుసు. మన దివాణం వీటిని అమలు చేయడానికి సిద్ధపడిందంటే ఎంతో కొంత స్వేచ్ఛను కోల్పోయినట్లే స్వేచ్ఛతోపాటు మన వ్యక్తిత్వాన్ని కూడా పోగొట్టుకోకూడదు. అందుకు అనుగుణంగా వీటిలో విషయాలను అధ్యయనం చేయండి. వాటిని విశ్లేషించి నాకు వివరించండి" అని చిన విజయరామరాజు వారిని ఆదేశించారు.

"చిత్తం మహారాజా" వారు అక్కడినుంచి వెళ్ళిపోయారు.

తమపైన ఎంతటి కీలకమైన బాధ్యత ఉంచబడిందో ఆ సిబ్బందికి కొంతవరకు అర్థం అయింది. తాము చెప్పబోయే విషయాలు రాజుగారికి మార్గదర్శకంగా ఉంటాయని అందువల్ల బాధ్యతతో వ్యవహరించాలని వారు అనుకున్నారు.

వారు వెళ్ళిన తర్వాత చిన విజయరామరాజు దివాన్ సీతారామరాజుని పిలిచి "ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తమరే ఏదో పరిష్కారాన్ని చూస్తుంటారు. గండం నుంచి గట్టెక్కిస్తుంటారు. ఈ సమస్యకు కూడా తమరే పరిష్కారం చూడాలి" అన్నారు.

దివాన్ సీతారామరాజు చినరాజా దగ్గరికి వచ్చి కాసేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత గొంతుని సవరించుకుని "ఇది రాజ్యంలో సమస్య కాదు. పరిష్కరించడానికి మన చేతిలో ఉండటానికి మన రాజ్య భవిష్యత్తుని నిర్ణయించే కీలకమైన విషయం. దీని పరిష్కారం మన చేతిలో లేదు. మనం తీసుకోబోయే ఏ నిర్ణయమైనా దానికి బ్రిటిష్ అధికారులే పరోక్షంగా కారణమవుతారు. ఈ సిఫార్సులు అమలు ప్రారంభం అయినప్పటినుంచీ సమస్యలు కూడా మొదలవుతాయి. దేనికైనా ఒక పరిష్కారం ఆలోచించాలి. అంతవరకు ఓపిక పట్టాలి" అన్నారు.

దివాన్ మాటలు చిన విజయరామరాజుకు కొంచెం బాధ కలిగించాయి.

అయినా ఏమీ మాట్లాడలేదు.

తన మాటలు రాజులో కాస్త బాధను కలిగించాయన్న విషయం దివాన్‌కి అర్థం అయింది. వెంటనే సర్దుకుని "మనం ఈ సమస్యని అధిగమిద్దాం. ఎటువంటి ఆందోళన అవసరంలేదు. ఈ సిఫార్సుల గురించి ఇప్పటికే కొంత విన్నాం. మనవాళ్ళు చదువుకుని వచ్చిన తర్వాత ఈ సిఫార్సులు మన దివాణాన్ని ఎంతవరకు నష్టపరుస్తాయన్న విషయాన్ని మనం గుర్తిద్దాం. ఆ తర్వాత అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుందాం. అంతవరకు దాని గురించి ఆలోచించడం అనవసరం" అని నెమ్మదిగా చెప్పాడు.

దివాన్ మాటలు చిన విజయరామరాజులో కొంత సంతృప్తిని కలిగించాయి. కొన్ని గంటల నుంచి మనసు మనసులో లేకుండా ఎంతో ఆందోళనతో ఉంది. దివాన్ మాటలు విన్న తర్వాత ఒకలాంటి ప్రశాంతత వచ్చింది" మీరు చెప్పింది ఎంతో సమంజసంగా ఉంది. ఆ వివరాలు తెలుసుకున్న తర్వాత ఇతర విషయాలను ఆలోచిద్దాం" అని సమావేశాన్ని ముగించారు. తర్వాత తన అంతరంగ మందిరానికి వెళ్ళడానికి లేచి నిల్చున్నారు. అతనితోపాటు అక్కడున్న వారందరూ లేచి నిల్చుని అతనికి వీడ్కోలు పలికారు.

దివాన్ సీతారామరాజు కూడా తన మందిరానికి బయలుదేరడానికి లేచి నిల్చుని ముందుకు కదిలాడు. అక్కడున్న చాలామంది అతనిని అనుసరించి బయలుదేరారు.

*విజయనగరం సంస్థానం బలగాలు తగ్గింపు*

విజయనగరం సంస్థానంలో బ్రిటిష్ వారు అమలు చేయాలనుకున్న సర్క్యూట్ కమిటీ సిఫార్సులు ఒక్కొక్కటి అమలు జరపడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. విశాఖ జిల్లా కలెక్టరు విజయరామరాజుకు అందించిన నివేదికల ఆధారంగా ఎటువంటి పరిస్థితులు ఏర్పడతాయో వివరాలు వచ్చాయి. ఇందుకోసం బాధ్యతలు తీసుకున్న సిబ్బంది అన్నీ పరిశీలించి కూలంకషంగా చర్చించి వివరంగా అందించిన సంగతులు విజయరామరాజుకు చేరాయి.

ఈ సిఫార్సులలో ప్రధానమైనది విజయనగరం సంస్థానంలో అంగబలాలను పూర్తిగా తగ్గించాలన్నది. రాజాస్థానాలలో అన్ని వ్యవహారాల్లో సైన్యానికి కీలకమైన పాత్ర ఉంది. వారు ఎంతమంది పనిచేయాలి వారి పనితీరు ఎలా ఉండాలి వంటి విషయాలు కూడా బ్రిటిష్ వారే నిర్ణయిస్తారు. అయితే అంతవరకు ఆయా సంస్థానాలు స్వంతంగా నిర్ణయించుకుని తమకు అవసరమైన బలగాలను నియమించుకునేవారు. ఈ సిఫార్సులను అమలు చేయడం వల్ల అటువంటి విషయాలపై బ్రిటిష్ వారి పెత్తనం ఇబ్బందిగా అనిపించింది. ప్రధానమైన ఇటువంటి అంశాలపై వారు ఎందుకు కలగజేసుకుంటున్నారో కారణాలు మింగుడుపడలేదు. సంస్థానంలో బలగాలను తగ్గించాలని వారు తీసుకున్న నిర్ణయంపై చిన విజయరామరాజుకు బ్రిటిష్ వారిపై మొదటిసారి తీవ్రమైన అసంతృప్తి కలిగింది. దీనిని ఎప్పుడు ఎలా వ్యక్తం చేయాలో అర్థంకాలేదు.

విజయనగరం సంస్థానంలో ప్రధానమైనదిగా సైనిక విభాగం ఉండేది.

ఆ విభాగంలో పనిచేసేవారిలో దివాణంలో పదిహేనువందల మంది వివిధ విభాగాలలో ఉండేవారు. వారు రక్షణ వ్యవహారాలతో పాటు ఇతర వ్యవహారాలు చూసేవారు కొంతమంది దివాణం పరిపాలనలో పాలుపంచుకునేవారు. వీరితోపాటు విజయనగరం సంస్థానానికి అనుబంధంగా పనిచేస్తున్న ఇతరప్రాంతాలలో అదనపు సిబ్బంది కూడా ఉండేవారు. వీరందర్నీ కలుపుకుంటే మొత్తం అయిదువేల మంది వరకు పరిపాలన కోసం రక్షణ కోసం బలగాలుగా పనిచేసేవారు.

ఈ బలగాలలో సగానికి సగం మందిని తగ్గించడం అన్నది ఒక సమస్యగా తయారైంది. అంతవరకు ఈ పరిపాలనలో పాలుపంచుకున్నవారు. వయస్సు మీరిన తర్వాత ఇళ్ళకి పంపించే సమయంలో వారి వారసులకు అవకాశం ఇవ్వడం ఒక సాంప్రదాయంగా వస్తోంది. సైనికులు పదవీ విరమణ మాదిరిగా పదవి నుంచి విరమణ పొందినప్పుడు వారికి సంబంధించిన వారు వారసులు లేకపోతే పర్వాలేదు. కానీ దివాణం సాంప్రదాయం ప్రకారం ఎక్కువ సందర్భాలలో అటువంటి సైనికుల కుటుంబీకులకు దివాణంలోనే మళ్ళీ ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. బ్రిటిష్ వారు సూచన ప్రకారం ఎవరిని కొలువులోంచి తీసివేయాలన్నది విజయరామరాజుకు ప్రశ్నార్ధకంగా తయారైంది. ఉద్యోగం నుంచి తొలగించి ఇళ్ళకు పంపించడానికి ఏ ప్రాతిపదికన అంచనా వేయాలన్నది అర్థం కాని విషయంగా తయారైంది. ఒకవేళ కొంత మందిని ఎంపిక చేసివారిని పనిలోనుంచి తొలగించి వేస్తున్నట్లు ప్రకటించినట్లయితే వారి స్థానంలో ఎవరికి అవకాశం ఇవ్వాలి. కొత్తగా సైనిక బలగాలుగా నియమించడానికి అవకాశం లేనందువల్ల వారి కుటుంబాలకు ఏ విధంగా సాయం చేయాలన్న విషయంలో కూడా సందేహాలు తలెత్తాయి.

అటువంటి విపత్కర పరిస్థితుల్లో అతనికి దివాన్ సీతారామరాజు గుర్తుకు వస్తుంటాడు. వెంటనే అతనికి కబురు వెళ్ళింది. పిలుపు అందుకున్న వెంటనే దివాన్ సీతారామరాజు రాజమందిరంలోకి వచ్చి రాజుగారికి ఎదురుగా నిల్చున్నాడు.

విజయరామరాజు దివాన్‌తో మొత్తం సమస్యను వివరంగా చెబుతూ "బ్రిటిష్ వారు మనకు పంపించిన తాఖీదు మేరకు మన సేనలను తగ్గించాలి. ఎవరిని తగ్గించాలన్న విషయంలో చాలా ఆలోచన చేయాలి. ఈ విషయంలో ఏమీ చేయాలో ఎలా చేయాలో తమరే సలహా ఇవ్వండి" అన్నారు.

"చినరాజా ఈ సమస్య చాలా చిన్నదిగా కనిపిస్తున్నప్పటికీ అమలు చేసే సమయంలో మరికొన్ని సమస్యలు కూడా వస్తాయి. తగ్గింపు అన్నది ఒక చిన్న మాటే అయినప్పటికీ ఎవరిని పనిలోంచి తీసివేసినా వారి కుంటుంబానికి ఇబ్బందులు వస్తాయి. అటువంటి వారికి వారి కుటుంబీకులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి. అందుకు తగిన ఏర్పాట్లు చూడాలి. అంతేకాకుండా ఇంతవరకు వారు చేసే పనులు ఇకపై ఎవరు చూడాలన్న విషయంలో తగిన ఏర్పాట్లు చేయాలి"

"ఏమి చేద్దాం?"

"మన సంస్థానంలో వివిధ పనులు చేయడానికి కొంతమంది ఉన్నారు. వీరిలో మనకు కొంతమంది అవసరంలేదు. చాలాకాలంగా వారు దివాణంలో ఉన్నందువల్ల ఇంతవరకు వారిని మనం కూడా కొనసాగిస్తున్నాం. ఇకపై ఇటువంటి వారిలో మనకు అవసరం లేని వారిని తప్పిందాం. అదే విధంగా మన రాజ్యానికి చెందిన వారు ఇతర ప్రాంతాలలో మన అనుబంధ సంస్థానాల్లో పనిచేస్తున్నారు. వారిని కూడా కొంతమేర తగ్గించినట్లయితే బ్రిటిష్ వారు మన దివాణానికి అందించిన లెక్కలు కొంతవరకు సరిపోతాయి. అందుకనుగుణంగా మన దివాణంలో ఉన్న మన బలగాలను తగ్గించాలి" దివాన్ వివరంగా చెప్పాడు.

దివాన్ చెప్పిన వివరాలు రాజుకు చాలా నచ్చాయి.

"తమరి లెక్కల ప్రకారం మనకు అవసరం లేనివారిని ముందు తగ్గిద్దాం తర్వాత ఇంకా అదనపు సిబ్బంది ఉంటే వారిని కూడా తగ్గించడానికి చూద్దాం" అన్నారు.

దివాణంలో లెక్కలు మొదలయ్యాయి.

బ్రిటిష్ వారు అందించిన సర్క్యూట్ కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి ప్రస్తుతమున్న సిబ్బందిలో చాలామందిని తగ్గించవలసి ఉంటుంది. అందుకు సంబంధించిన లెక్కలు తయారయ్యాయి. తీసి వేయవలసిన సిబ్బంది లెక్కలు వేశారు. వారికి ఇకపై దివాణంలో ఉద్యోగం ఉండనందున వారి కుటుంబానికి పోషణకోసం ఎంత సొమ్ము చెల్లించాలన్న విషయంలో కూడా ఖజానా అధికారులు లెక్కలు వేసి వారికి చెల్లించడానికి ఏర్పాట్లు చేశారు.

తగ్గింపులో ఎక్కువగా వృద్ధులు ఉన్నారు. అంతగా అవసరంలేని పనికి రాని పనుల్లో ఉన్నవారు మరికొంతమంది ఉన్నారు. వీరంతా విషయం విని ఆందోళన చెందారు చాలామంది విజయరామరాజు వద్దకు వచ్చి "అర్థాంతరంగా తమను ఉద్యోగాలు తీసివేసి ఇళ్ళకు వెళ్ళమంటే ఎలా వెళ్ళగలం ఇంట్లోవారికి ఊరిలో వారికి ఏ విధంగా సమాధానం చెప్పగలం? వెళ్ళగొట్టేటప్పుడు తమరు అందిస్తున్న పరిహారం కొద్దినెలల్లో హారతి అయిపోతుంది. అప్పుడు మా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు.




విజయరామరామరాజు సమాధిపై శిలాఫలకాన్ని ఏర్పాటు చేసారు. ఇందులో లిపి కూడా ఆనాడు రాసిన మాదిరిగా ఉంటుంది ఒక శ్లోకం మాత్రం రాసి ఈ శిలాఫలకాన్ని సమాధికి తాపడం చేసారు.

"మిమ్మల్ని ఇబ్బంది పెట్టాలని మా ఉద్దేశ్యం కాదు. ఇంతకాలం విజయనగర సంస్థానికి ఎనలేని సేవలు చేశారు. మీ సేవల్ని మేము మరిచిపోయింది లేదు. ఎప్పటికీ మీరంతా ఈ దివాణానికి ఆత్మీయులే.. " చిన విజయరామరాజు వారిని అనునయించారు.

దివాన్ కలగజేసుకుని "ఇదంతా బ్రిటిష్ వారు చేసిన పని వారి కారణంగా మీ అందరికీ ఇబ్బంది కలిగింది. దీనికి రాజుగారికి మీ పై ఎటువంటి అసంతృప్తిలేదు. ఇదంతా తెల్లదొరల ఎత్తుగడ. దీనిని మనం వ్యతిరేకించాలి. దీనంతటికీ కారణం బ్రిటిష్‌వారే అన్నాడు.

సిబ్బందిని తగ్గించడానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి.
వారందరికి పరిహారాలు ఇవ్వడానికి ఘనంగా వీడ్కోలు పలకడానికి ఏర్పాట్లు చురుగ్గా జరిగాయి.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments